# ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికతో గ్రామాభివృద్ధికి కొత్త దిశ




**గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక దోహదపడుతుంది**

**కలెక్టరు బాధవత్ సంతోష్ నాయక్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్,ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా నాగర్ కర్నూలు జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం కల్వకుర్తి మండల పరిధిలోని తర్నికల్ ప్రజా పాలన గ్రామసభకు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ హాజరయ్యారు.జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, మాట్లాడుతూ, ప్రజల అవసరాలు, స్థానిక సమస్యలను తెలుసుకుని ప్రణాళికలు రూపొందించడం ద్వారా నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 99 రోజుల యాక్షన్ ప్లాన్ "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి కీలకంగా మారనుందని, మార్చి 6వ తేదీ నుంచి జూన్ 12 వరకు ఈ కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

జిల్లావ్యాప్తంగా 460 గ్రామపంచాయతీలు మరియు నాగర్ కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్, అచ్చంపేట మున్సిపాలిటీల పరిధిలోని 85 వార్డుల్లో గ్రామ సభలను విజయవంతంగా నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఐదు దశల్లో అమలు చేస్తూ, ఏప్రిల్ 16న మండల స్థాయి, మే 2న నియోజకవర్గ స్థాయి, మే 22న జిల్లా స్థాయి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంతో ఈ కార్యక్రమానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. విద్య, వైద్య, వ్యవసాయం సహా పది ముఖ్య థీమ్‌లతో రూపొందించిన ఈ ప్రణాళిక గ్రామాల అభివృద్ధికి దోహదపడుతుందని ఆయన వివరించారు. ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాలను అమలు చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. గ్రామ సభల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతోందని తెలిపారు. ఈ సందర్భంగా రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రుణ మాఫీ, ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాల వివరాలను ప్రజలకు తెలియజేస్తున్నారు. ప్రభుత్వ లక్ష్యం నిజమైన లబ్ధిదారులకు ఈ పథకాలు చేరేలా చూడటమేనని కలెక్టర్ స్పష్టం చేశారు. విద్యా రంగంలో కూడా పలు మార్పులు తీసుకొస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడీ నుంచి పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించడంతో పాటు, ఇంటర్మీడియట్ విద్యార్థులకు అల్పాహారం మరియు మధ్యాహ్న భోజన పథకాన్ని కొత్తగా ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు. అదేవిధంగా ప్రతి కుటుంబానికి ?5 లక్షల ప్రమాద భీమా కల్పించే ఇందిరమ్మ ఆర్థిక భీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు.పాఠశాలలు, కళాశాలల్లో గంజాయి, డ్రగ్స్, ఈ-సిగరెట్ల వినియోగంపై జాగ్రత్తలు తీసుకోవాలని, వాటి వల్ల విద్యార్థులు మరియు కుటుంబాలకు కలిగే నష్టాన్ని గుర్తించాలని కలెక్టర్ సూచించారు. గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి ప్రతి ఒక్కరు భాగస్వామ్యులై ఈ 99 రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ప్రణాళిక ద్వారా సమగ్ర అభివృద్ధి సాధ్యమై, గ్రామాల పచ్చదనం మరియు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు, మండల స్థాయి అధికారులు, తర్నికల్ గ్రామ సర్పంచ్ వరలక్ష్మి, ఉపసర్పంచ్, గ్రామ వార్డు మెంబర్లు గ్రామ ప్రజలు ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు



**5000 వేలు ఆర్థిక సహాయం అందజేసిన డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ ,మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనరసింహారెడ్డి అన్నారు. గురువారం కడ్తాల్ మండలంలోని మద్రిపల్లి గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్త పుర్కల శ్రీను అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షులు జోగు వీరయ్య, మాజీ సర్పంచ్ జంగయ్య, మాజీ ఉప సర్పంచ్ నరసింహలతో కలిసి పరామర్శించి ఓదార్చారు. ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులను కోరారు. ఏ ఆపద ఉన్న బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు 5,000వేల ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు నరేందర్, మల్లయ్య, లక్ష్మణ్, దాసు, కృష్ణయ్య, రాయకంటి సురేష్, చెన్నకేశవులు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు



**భౌతిక రసాయన శాస్త్రానికి 99.9% హాజరు**

**డీఈఓ జి. శారద.**

**అగ్ని ధార న్యూస్ ,(పెద్దపల్లి):** జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించబడినట్లు జిల్లా విద్యాశాఖాధికారి జి. శారద తెలిపారు. గురువారం నిర్వహించిన భౌతిక రసాయన శాస్త్ర పరీక్షకు విద్యార్థులు భారీగా హాజరయ్యారని పేర్కొన్నారు.

ఈ పరీక్షకు మొత్తం 7,495 మంది హాజరు కావాల్సి ఉండగా, 7,485 మంది విద్యార్థులు పరీక్ష రాశారని, 10 మంది గైర్హాజరైనట్లు వివరించారు. మొత్తం 99.9 శాతం హాజరు నమోదైనట్లు తెలిపారు.పరీక్ష నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదని, మాల్‌ప్రాక్టీస్ కేసులు ఒక్కటీ నమోదు కాలేదని స్పష్టం చేశారు.

# మృగాల కంటే ఘోరంగా.. మహిళపై పైశాచికం క్షమార్హం కాదు!

**నిందితులను నడిరోడ్డుపై ఉరితీయాలి**

**సమతా సైనిక దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్**

**అగ్నిధార న్యూస్,(రామగుండం) :**

నాగర్‌కర్నూల్ జిల్లా ఊరుకొండలో ఒక మహిళపై ఎనిమిది మంది మృగాళ్లు జరిపిన సామూహిక లైంగిక దాడి, ఆపై ఆమె పట్ల ప్రదర్శించిన అమానవీయ ప్రవర్తన సభ్య సమాజం తలదించుకునేలా ఉందని సమతా సైనిక దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ మండిపడ్డారు. దాహం వేస్తోందని ప్రాధేయపడిన బాధితురాలి పట్ల మానవత్వం లేకుండా ప్రవర్తించిన ఆ కిరాతకులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో మహిళలను దేవతలుగా ఆరాధించాలని నీతులు చెబుతుంటే, క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం దారుణంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఊరుకొండ ఘటనలో బాధితురాలి నోట్లో మూత్రం పోయడం వంటి చర్యలు వింటుంటే అటవీ రాజ్యంలో ఉన్నామా? అన్న అనుమానం కలుగుతోందన్నారు. మన దేశంలో ఎన్ని కఠిన చట్టాలు వచ్చినా, కోర్టులు ఎన్ని శిక్షలు విధిస్తున్నా కామాంధుల్లో మార్పు రాకపోవడం విచారకరమని పేర్కొన్నారు.

**ముఖ్య డిమాండ్లు:**

ఫాస్ట్ ట్రాక్ కోర్టు: ఈ కేసును అత్యంత వేగంగా విచారించి, నిందితులకు తక్షణమే కఠిన శిక్ష పడేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలి.

**కఠిన చర్యలు:** మహిళల రక్షణ విషయంలో ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించకుండా, ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడే వారికి వణుకు పుట్టేలా చర్యలు తీసుకోవాలి. పోలీసుల నిఘా: పారిశ్రామిక, నిర్మానుష్య ప్రాంతాల్లో పోలీసు గస్తీని పెంచి మహిళలకు భద్రత కల్పించాలి. మానవత్వమున్న ఏ వ్యక్తి కూడా ఇలాంటి హేయమైన చర్యను సమర్థించడని, నిందితులకు సమాజంలో తిరిగే అర్హతే లేదని ఆయన స్పష్టం చేశారు. బాధితురాలికి ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా నిలవాలని, పరారీలో ఉన్న మిగిలిన నిందితులను కూడా వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ డిమాండ్ చేశారు.



## అంజన్న సేవలో ఎమ్మెల్సీ మల్క కొమరయ్య భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి వేడుకలు



**అగ్ని ధార న్యూస్ (సికింద్రాబాద్,):**

సికింద్రాబాద్ మినర్వా కాంప్లెక్స్‌లో హనుమాన్ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శాలివాహన గ్రూప్ యజమానులు, కిరాయిదారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించగా, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హనుమంతుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. అనంతరం శాలివాహన గ్రూప్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మల్క కొమరయ్య మాట్లాడుతూ, హనుమంతుడి పేరు స్మరించినప్పుడే అపారమైన ధైర్యం కలుగుతుందని పేర్కొన్నారు. భక్తి మార్గంలో నడుస్తూ నేటి యువత ధైర్యసాహసాలతో ముందుకు సాగాలని, ధర్మం వైపు నిలవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు, భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జనగామ యాదవ నగర్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ చేపట్టాలి

**డివిజన్ సమస్యలపై వార్డు సభలో వినతిపత్రం అందజేత**

**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం):**

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 6వ డివిజన్ జనగామ యాదవ నగర్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. అలాగే జనగామ డివిజన్‌ను టూ టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి విలీనం చేయాలని కోరారు.

గురువారం జనగామలో నిర్వహించిన వార్డు సభలో సిపిఐ ఆరవ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో అధికారులు, వార్డు సభ అధికారి మరియు డివిజన్ కార్పొరేటర్ తొకల శ్యామనిరమేశ్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ విషయాన్ని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తొడుపునూరి రమేశ్ కుమార్ తెలిపారు.పలు సమస్యల పరిష్కారానికి డిమాండ్ డివిజన్‌లోని యాదవ నగర్ బస్తీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేయడం, ప్రస్తుతం ఉన్న ఓపెన్ డ్రైనేజీలను భూగర్భ డ్రైనేజీలుగా మార్చడం అవసరమని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రధాన రహదారిపై సెంట్రల్ లైటింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు.శివాలయాన్ని ఆధునీకరించడం, ఎల్లమ్మ గుడి రహదారిని సీసీ రోడ్డుగా నిర్మించడం, ఎల్లారం పోచమ్మ గుడి సమీపంలోని శివాలయం నుంచి గోదావరి నది వరకు సీసీ రోడ్డును ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. చెరువు అభివృద్ధికి ప్రణాళిక జనగామ చెరువులోకి గోదావరిఖని నుంచి వచ్చే మురుగు నీటిని శుద్ధి చేసి పంపించాలని, చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి సివిల్ డిపార్ట్మెంట్ నాయకులు దోరగండ్ల మల్లయ్య, స్థానికులు పృథ్వీరాజ్, గుండబోయిన సారయ్య, ఊదరి పోషం తదితరులు పాల్గొన్నారు.



## అటవీశాఖ శిక్షణలో సత్తా చాటిన పెద్దపల్లి జిల్లా అధికారి

**అగ్ని ధార న్యూస్ ,(పెద్దపల్లి):**



పెద్దపల్లి జిల్లాలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ స్ట్రైక్ ఫోర్స్‌లో పనిచేస్తున్న ఎస్.డి. రహిమతుల్లా ఇటీవల జరిగిన అటవీశాఖ శిక్షణలో అసాధారణ ప్రతిభ చూపించి సత్తా చాటారు. ఉద్యోగ పదోన్నతి కోసం మూడు నెలల పాటు హైదరాబాద్‌లోని దూలపల్లి ఫారెస్ట్ అకాడమీలో నిర్వహించిన 8వ బ్యాచ్ ఎఫ్ఎస్ వోప్రీ ) శిక్షణలో రహిమతుల్లా నాలుగు బంగారు పతకాలు సాధించి జిల్లాకు కీర్తి తెచ్చారు. అతను ఫారెస్ట్ సర్వే, మెన్సురేషన్ ు ఇంజినీరింగ్, సిల్వికల్చర్, ఫారెస్ట్ రీసెర్చ్ ు అటవీ ఉత్పత్తులు, జీవనోపాధి, ప్లాంటేషన్ ఫారెస్ట్రీ ు సోషల్ ఫారెస్ట్రీ మరియు వైల్డ్ లైఫ్ మేనేజ్‌మెంట్ విభాగాల్లో అత్యుత్తమ ప్రదర్శన చేసి గోల్డ్ మెడల్స్ కైవసం చేసుకున్నారు.శిక్షణ ముగింపు సమయంలో ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (ఐఎఫ్ఎస్ ) డా. సి. సువర్ణ మరియు సీసీఎఫ్ చార్మినార్ సర్కిల్ ు డైరెక్టర్ డా. ప్రియాంక వర్గీస్ చేతుల మీదుగా ఈ నాలుగు బంగారు పతకాలను అందుకున్నారు. రహిమతుల్లా సాధించిన ఈ విజయాన్ని జిల్లా అటవీ అధికారి సీఎచ్ శివయ్య మరియు ఇతర సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

# అంబేద్కర్ జయంతిని అధికారికంగా, ఘనంగా నిర్వహించాలి

**'దళిత రత్న' డా. దుర్గం నరసయ్య డిమాండ్.**

**అగ్ని ధార న్యూస్,(రామగుండం):**

భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలను ఎన్టీపీసీలో అధికారికంగా, అత్యంత ఘనంగా నిర్వహించాలని ఎన్టీపీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, దళిత రత్న అవార్డు గ్రహీత డా. దుర్గం నరసయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. అంబేద్కర్ ఆశయాలను స్మరించుకోవడంలో పాలకులు, అధికారులు నిర్లక్ష్యం వహించడం సరికాదని హితవు పలికారు. ఈ సందర్భంగా ఆయన గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. "1985లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే ఎక్కడా లేని విధంగా, ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఎన్టీపీసీ - ఎఫ్సీఐ కూడలిలో ప్రతిష్ఠించాం. అప్పటి నుంచి అన్ని వర్గాల వారిని సమన్వయం చేసుకుంటూ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలను పండగలా నిర్వహించేవాళ్లం. కానీ, గత పదేళ్లుగా పరిస్థితి దారుణంగా తయారైంది" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రజాప్రతినిధులు, అధికారులు కేవలం నామమాత్రంగా వచ్చి దండలు వేసి వెళ్తున్నారే తప్ప, ఆ మహనీయుని స్ఫూర్తిని చాటేలా కార్యక్రమాలు నిర్వహించడం లేదని విమర్శించారు. రాబోయే 135వ జయంతి ఉత్సవాలనైనా ప్రభుత్వం, ఎన్టీపీసీ యాజమాన్యం ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని నరసయ్య కోరారు. పారిశ్రామిక ప్రాంతంలోని కార్మికులు, యువతకు అంబేద్కర్ చూపిన సామాజిక న్యాయం, విద్యా ప్రాధాన్యత గురించి తెలిసేలా ప్రత్యేక సభలు, అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ చేసిన కృషిని స్మరిస్తూ, సమాజంలో సమానత్వం సాధించే దిశగా అడుగులు వేయడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ వేడుకల నిర్వహణలో అధికారులు ఇప్పటికైనా అలసత్వం వీడి, చొరవ చూపాలని ఆయన డిమాండ్ చేశారు.

## నమోదైన నిర్మాణ కార్మికులకు శుభవార్త

**పిల్లలకు విదేశీ ఉద్యోగ అవకాశాలు**

**నైపుణ్యాల గుర్తింపు కార్యక్రమం**

**అగ్నిధార న్యూస్,(పెద్దపల్లి):**



కార్మిక శాఖలో నమోదైన భవన మరియు ఇతర నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం శుభవార్త తెలిపింది. కార్మికులు సంవత్సరాలుగా సాధించిన నైపుణ్యాలను అధికారికంగా గుర్తించే నైపుణ్యాల గుర్తింపు కార్యక్రమంను అమలు చేయనుంది. అర్హులైన కార్మికులకు విదేశాల్లో మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతోంది.ఇక నమోదైన నిర్మాణ కార్మికుల పిల్లలకు కూడా విదేశీ ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారు. 18 నుండి 30 సంవత్సరాల మధ్య వయస్సు గల, కనీసం 8వ తరగతి విద్యార్హత ఉన్న వారికి ప్రభుత్వం ఉచితంగా భాషా శిక్షణతో పాటు సాఫ్ట్ స్కిల్స్ శిక్షణ అందించనుంది. శిక్షణ అనంతరం విదేశాల్లో ఉద్యోగాలు పొందేందుకు మార్గదర్శనం చేయనున్నారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని కుటుంబ భవిష్యత్తును మెరుగుపరచుకోవాలని అధికారులు సూచించారు. పూర్తి వివరాల కోసం పెద్దపల్లి, మంథని, గోదావరిఖని కార్మిక శాఖ కార్యాలయాలను సంప్రదించాలని తెలిపారు.ఈ మేరకు ఉప సహాయ కార్మిక కమిషనర్, నోడల్ అధికారి (పెద్దపల్లి ఉ కరీంనగర్) వెంకటరమణ ఒక ప్రకటనలో వెల్లడించారు.

## గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



**విద్యా సంవత్సరం నాటికి పనులు పూర్తిచేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశం**

**అగ్నిధార న్యూస్ ,(పెద్దపల్లి):**

జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఇంజనీరింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పనుల పురోగతిని పరిశీలించారు. అభివృద్ధి పనులకు భూసేకరణ పూర్తయిన తర్వాత ఎక్కడైనా ఆటంకాలు ఎదురైతే వెంటనే తహసీల్దార్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. పీఎం జుగాడ్ కింద చేపట్టిన పనులు ఆలస్యం కావడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్, రాబోయే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పనులు పూర్తిచేయాలని ఆదేశించారు.విద్యా సంస్థల్లో పనులు వేగవంతం చేయాలి జిల్లాలోని విద్యా సంస్థల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, కొత్త తరగతి గదులు, మౌలిక వసతుల పురోగతిని సమీక్షిస్తూ విద్యార్థులకు సమయానికి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అవసరమైతే షిఫ్టులు పెంచి, రాత్రి వేళల్లో కూడా పనులు కొనసాగించాలని తెలిపారు.

**రోడ్లు, స్టేడియం పనులపై దృష్టి**

మంథనిలో రూ.5 కోట్లతో స్టేడియం నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెద్దపల్లి--మంథని మధ్య బీటీ రోడ్డు పనులను మే 15, 2026 నాటికి పూర్తి చేయాలని, మే నెలాఖరు నాటికి లైనింగ్, మీడియన్ పనులు ముగించాలని పేర్కొన్నారు.చెరువుల అభివృద్ధి, సాగునీరు రావుల చెరువు, అయ్యగారి చెరువు వద్ద బండ్ నిర్మాణం, సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాలోని పంట పొలాలకు మరోసారి నీటి విడుదల అవసరముందని పేర్కొంటూ చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో ఈఈ పీఆర్ శంకరయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## గోదావరిఖని ఆసుపత్రిలో కంటి శాస్త్ర చికిత్సలు ప్రారంభం

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.**

**కాట్రేక్ సర్జరీ విజయవంతంగా నిర్వహణ.**

**అగ్నిధారన్యూస్**

**పెద్దపల్లి, ఏప్రిల్ -02:**



గోదావరిఖని (రామగుండం)జనరల్ ఆసుపత్రిలో కంటి శస్త్ర చికిత్సలను ప్రారంభించామని, అవసరమైన ప్రజలు వీటిని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆప్తామాలజిస్ట్ విభాగం లో శస్త్ర చికిత్సలను బుధవారం ప్రారంభించామని కలెక్టర్ తెలిపారు. ఆప్తమాలజిస్ట్ డాక్టర్ గోపికృష్ణ ఆధ్వర్యంలో నిన్న ఒక కాట్రేక్ సర్జరీ విజయవంతంగా నిర్వహించడం జరిగిందని అన్నారు.పెద్దపల్లి జిల్లాలోని ప్రజలు, గోదావరిఖని పరిసర ప్రాంతాల ప్రజలు కాట్రేక్ ఆపరేషన్లు అవసరం అయితే గోదావరిఖని జనరల్ ఆసుపత్రికి రావాలని, ఇక్కడ అవసరమైన అన్ని రకాల పరికరాలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ప్రజల ఆశయాలకు అనుగుణంగా పాలన



**ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**

**అగ్నిధార న్యూస్, (రామగుండం):**

ప్రజల ఆశయాలను కార్యరూపంలోకి తీసుకువస్తున్న ప్రజా పాలన ప్రభుత్వం సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా గురువారం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 39వ డివిజన్ శివాజీ నగర్ కూరగాయల మార్కెట్ సమీపంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 99 రోజుల యాక్షన్ ప్లాన్ ద్వారా సంక్షేమం, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు, ఉపాధి వంటి కీలక రంగాల్లో స్పష్టమైన కార్యాచరణను అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రతి వారం ఒక ముఖ్య రంగంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రజలకు వేగవంతమైన సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.పారదర్శక పాలనతో ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా తెలంగాణను మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం ప్రజా సంక్షేమమేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామగుండం మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కార్పొరేటర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

## హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి



**అగ్నిధార న్యూస్ ,(రామగుండం):**

హనుమాన్ జయంతి సందర్భంగా రామగుండం నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉన్న ఆంజనేయస్వామి ఆలయాలను రామగుండం శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ సతీమణి మనాలి ఠాకూర్ సందర్శించారు. ఈ సందర్భంగా భక్తి శ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులతో కలిసి ఆధ్యాత్మిక వాతావరణంలో పాల్గొని ప్రాంత ప్రజల శ్రేయస్సు, సుఖశాంతుల కోసం ప్రార్థనలు చేశారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా ప్రసాదం పంపిణీ చేశారు. సేవాభావాన్ని చాటుకుంటూ భక్తులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హనుమాన్ జయంతి పర్వదినం ధైర్యం, భక్తి, నిస్వార్థ సేవకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. సమాజంలో ఐక్యత, సోదరభావం పెంపొందించేందుకు ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతో అవసరమని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సర్దార్ సర్వాయి పాపన్నకు ఘన నివాళులు

**అగ్నిధార న్యూస్ ,(రామగుండం):**



సర్దార్ సర్వాయి పాపన్న 316వ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ పట్టణ గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక మేడిపల్లి సెంటర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం బి పవర్ హౌస్ గడ్డ హనుమాన్ జంక్షన్ వద్ద ఉన్న సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలలు సమర్పించి గౌరవ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ, సర్దార్ సర్వాయి పాపన్న సేవలు, త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘ బాధ్యులు మాచేడి మహేందర్ గౌడ్, తిరుమల సురేందర్ గౌడ్, కట్ల కనకయ్య, కంకటి రవి గౌడ్, బుర్ర దేవేందర్ గౌడ్, భూమేష్ గౌడ్, ఆరెల్లి కుమార్ గౌడ్, రంగు దుర్గాప్రసాద్ గౌడ్, గున్నాల శ్రీధర్, కోడూరు రవి, జనార్ధన్, పైడిపల్లి శ్రీనివాస్ గౌడ్, ఏపూరి లక్ష్మణ్ గౌడ్, హరీష్ గౌడ్, బిందె నాగభూషణం గౌడ్ పాల్గొన్నారు. అలాగే రేవా అధ్యక్షులు ఆకుల రామ కిషన్, భగవతి యూత్ ప్రధాన కార్యదర్శి పైడా సాయికుమార్, కనుకుంట్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బొగ్గు రవాణాలో సరికొత్త రికార్డు



**సి.ఎస్.పి వన్ అధికారులకు, కార్మికులకు జీఎం లలిత్ కుమార్ అభినందనలు**

**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం):**

సింగరేణి ఆర్జీ వన్ ఏరియాలోని జీడీకే-1 సి.ఎస్.పి లో బొగ్గు రవాణా లక్ష్యాన్ని విజయవంతంగా సాధించిన సందర్భంగా ఆర్జీ వన్ జనరల్ మేనేజర్ లలిత్ కుమార్ అధికారులు, ఉద్యోగులు, కార్మికులను అభినందించారు.గురువారం సి.హెచ్.పి లో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, గత దశాబ్ద కాలంగా నమోదు కాలేని రికార్డును 2025-2026 సంవత్సరంలో అధిగమించడం గర్వకారణమని పేర్కొన్నారు.2015-2016 సంవత్సరంలో 1322 రేకుల ద్వారా 51 లక్షల టన్నుల బొగ్గు రవాణా జరగగా, 2025-2026లో 1376 రేకుల ద్వారా 55 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేసి ఆల్‌టైం రికార్డు సృష్టించినట్లు తెలిపారు. మార్చి నెలలోనే 147 రేకుల ద్వారా 5 లక్షల 85 వేల టన్నుల బొగ్గు రవాణా జరిపి, ఇంతకుముందు ఉన్న 135 రేకుల రికార్డును అధిగమించినట్లు తెలిపారు. ఈ విజయానికి అధికారులు, ఉద్యోగులు, కార్మికుల సమిష్టి కృషే కారణమని ప్రశంసించారు.

**రైల్వే అధికారులకు కృతజ్ఞతలు**

బొగ్గు రవాణాలో కీలకంగా సహకరించిన రామగుండం రైల్వే ఏరియా ఆఫీసర్ అక్షయ్ కుమార్ పాటిల్, స్టేషన్ సూపరింటెండెంట్ మునిరాం మీనా లకు జీఎం ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.భవిష్యత్తులో ఇదే ఉత్సాహంతో మరిన్ని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అధికారులు శ్రీనివాస్, జశ్వంత్, ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, విభాగ కార్యదర్శి బండి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు వేసవి సౌకర్యాలు కల్పించాలి

**ఓసిపిలు, విభాగాల్లో మజ్జిగ ప్యాకెట్లు -- చలవ పందిళ్లు ఏర్పాటు చేయాలి**

**సయ్యద్ సోహెల్**

**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం):**

సింగరేణి ఆర్జీ వన్ ఏరియాలో పని చేస్తున్న కార్మికుల కోసం వేసవి దృష్ట్యా మజ్జిగ ప్యాకెట్లు, చలవ పందిళ్లు ఏర్పాటు చేయాలని ఏఐటియుసి అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆర్జీ వన్ బ్రాంచి నాయకులు, విభాగాల ఇంచార్జీ సయ్యద్ సోహెల్ డిమాండ్ చేశారు. వేసవి కాలంలో ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులు (ఓసిపిలు), విభాగాల్లో పనిచేసే కార్మికులు ఎండదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కార్మికుల ఆరోగ్య రక్షణకు తక్షణ చర్యలు అవసరమన్నారు.విభాగాలు, ఓసిపిలలో పనిచేసే కార్మికులకు తగినంత మంచినీటి సౌకర్యం కల్పించడంతో పాటు చలవ పందిళ్లు ఏర్పాటు చేయాలని యాజమాన్యాన్ని కోరారు. అదేవిధంగా నాణ్యమైన మజ్జిగ ప్యాకెట్లు సరఫరా చేయాలని సూచించారు. ఎండలో పనిచేసే ప్రతి కార్మికుడికి గొడుగులు, నీడనిచ్చే వస్తువులు అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దీనివల్ల కార్మికులు ఎండ తీవ్రత నుంచి కొంత ఉపశమనం పొందగలరని తెలిపారు. కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్జీ వన్ యాజమాన్యం వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని సయ్యద్ సోహెల్ విజ్ఞప్తి చేశారు.

## ఆర్టిజన్ కార్మికుల వంటావార్పు కార్యక్రమం




**డిమాండ్లు పరిష్కరించకపోతే ఏప్రిల్ 8 నుంచి నిరవధిక సమ్మె హెచ్చరిక**

**అగ్ని ధార న్యూస్,(రామగుండం):**

రామగుండం సర్కిల్ కార్యాలయం వద్ద టీవీఏఈ జేఏసీ పిలుపు మేరకు ఆర్టిజన్ కార్మికులు వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఏప్రిల్ 8 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లాల్సి వస్తుందని వారు హెచ్చరించారు.గత నెల 26, 30 తేదీలలో నిర్వహించిన కార్యక్రమాల కొనసాగింపుగా ఈరోజు కూడా సర్కిల్ కార్యాలయం ఎదుట వంటావార్పు చేపట్టినట్లు తెలిపారు.ప్రభుత్వం తమ సమస్యలపై స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని కార్మికులు స్పష్టం చేశారు.ప్రధాన డిమాండ్లు ఒకే సంస్థలో ఒకే విధానాన్ని అమలు చేయాలని, విద్యా అర్హతల ఆధారంగా కన్వర్షన్ కల్పించి ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్‌ను వర్తింపజేయాలని ఆర్టిజన్ కార్మికులు ప్రధానంగా డిమాండ్ చేశారు.ప్రభుత్వం వెంటనే స్పందించి తమతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో కొంకటి శ్రీనివాస్, వడ్డేపల్లి సురేష్, ఆవుల మహేష్, దుర్గం విశ్వనాథ్, మల్లారపు ప్రభాకర్, ఎస్. రవి, జి. కిరణ్, బోరె శ్రీనివాస్, సదానందం, రమేష్, జనార్ధన్, కృష్ణ, కే. ప్రసాద్, రవి, సుధాకర్, సందీప్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

## బహుజన ఆత్మగౌరవానికి ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

**డా. మార్షల్ దుర్గం నగేష్**

**అగ్నిధార న్యూస్ ,(రామగుండం):**

బహుజన ఆత్మగౌరవానికి, పోరాట పటిమకు నిలువెత్తు సాక్ష్యం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని సమతా సైనిక దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ పేర్కొన్నారు. పాపన్న గౌడ్ జయంతిని పురస్కరించుకుని గురువారం సమతా సైనిక దళ్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా పాపన్న సాహసాలను, ఆయన ఆశయాలను స్మరించుకుంటూ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం డా. నగేష్ మాట్లాడుతూ అణిచివేతకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి గోల్కొండ కోటను స్వాధీనం చేసుకున్న మహోన్నత వ్యక్తి పాపన్న అని కొనియాడారు. "సర్వాయి పాపన్న ఒక కులానికి మాత్రమే పరిమితమైన నాయకుడు కాదు.. అణగారిన వర్గాల సమగ్ర ప్రతినిధి" అని అన్నారు. ఢిల్లీ పీఠాన్ని సైతం కదిలించిన గొప్ప నాయకత్వం ఆయనదని వివరించారు. సామాజిక సమానత్వం కోసం పాపన్న చేసిన త్యాగాలు నేటికీ ప్రేరణగా నిలుస్తున్నాయని తెలిపారు. యువత పాపన్న జీవిత చరిత్రను అధ్యయనం చేసి, ఆయన పోరాట స్ఫూర్తిని ఆచరణలో పెట్టాలని సూచించారు.ఆత్మవిశ్వాసంతో లక్ష్యాలను సాధించే దారిని పాపన్న జీవితం చూపిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమతా ఫౌండేషన్ , సమత గ్రంథాలయ చైర్మన్ చందనగిరి ప్రమీల, సమతా సైనిక దళ్ నాయకులు ముడిమడుగుల సురేష్, చీమల ఆనంద్, జిమ్మిడి అశోక్ , జిమ్మిడి శాంతి కుమార్ , గూడూరి 11 కుమార్, గన్న మహేష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

